కథ

# విమాన ప్రయాణ యోగం

## తాజీ ప్రసాద్

సుబ్బారావుకి విమానంలో ప్రయాణం చేయాలని ఎప్పటి నుంచో కోరిక. అయితే హైదరాబాదు నుంచి విశాఖపట్నం విమాన టికెట్ ధర తలుచుకుంటేనే ఫైవ్‌స్టార్ హాస్పిటల్ ఐ.సి.యులో చేరే ప్రమాదం తనకి ముంచుకొస్తుందని సుబ్బారావుకి తెలుసు. ఒకసారి ఇటునుంచి అటు ఎకానమీ క్లాసులో వెళ్ళినా ఆ ఖర్చు ఏడాది ఇంటి ఖర్చుకి సరిపెట్టుకోవచ్చని సుబ్బారావుకి తెలుసు. అందుకే విమాన ప్రయాణపు ఆలోచనని గాలిలోనే వదిలేశాడు.

సుబ్బారావు వుండేది హైదరాబాదులో అయినా విశాఖపట్నంలో సుబ్బారావుకి కనెక్షన్లు వున్నాయి. సుబ్బారావుకి బంధువులు, స్నేహితులు విశాఖపట్నంలో వున్నారు. తను పనిచేసే ఆఫీస్ ప్రధాన బ్రాంచి విశాఖపట్నంలోనే వుంది. అందుకే పని వున్నప్పుడు సుబ్బారావు ట్రెయిన్‌లోనే విశాఖపట్నం వెళ్ళి వచ్చేవాడు.

ఒక రోజు విడుదలవుతున్న మెగాస్టార్ పిక్చర్ మొదటిరోజు మొదటి ఆట చూద్దామని టికెట్ రిజర్వ్ చేసుకోవడానికి థియేటర్ వైపు సుబ్బారావు పాదయాత్ర మొదలుపెట్టాడు. దారిలో సుబ్బారావుకి చెట్టుక్రింద చిలక జ్యోతిష్కుడు కనిపించాడు. మూడు భాషలలో అదృష్టం చెప్పబడును అనే బోర్డ్ చూసి రేటెంతో కనుక్కొని, ఫరవాలేదనుకుని పంజరానికి అభిముఖంగా చి.జ్యో. దగ్గర సుబ్బారావు చతికిలబడ్డాడు.

చిలకని చి.జ్యో. పైకి రప్పించాడు. చిలక ఒక కార్డ్ తీసింది. ఆ కార్డ్‌కి ఒక ప్రక్క ఐశ్వర్యారాయ్ ఫోటో వుంది. సుబ్బారావు ఆ కార్డ్ చూసి స్వర్గంలో తేలిపోయాడు. ఆ కార్డ్‌కి మరొక ప్రక్కవున్న భాష ఏమిటో సుబ్బారావుకి అర్థం కాలేదు. అది చిలకభాష అనుకున్నాడు. దానిని ఏ భాషలోకి అనువదించాలని చి.జ్యో. సుబ్బారావుని అడిగాడు.

"దేశ భాషలందు తెలుగు లెస్స" అన్నాడు సుబ్బారావు.

"తెలుగులోకా, అలా చెప్పవచ్చు గదా" అని చి.జ్యో. చెప్పడం మొదలుపెట్టాడు.

"మిమ్మల్ని అదృష్టం వెతుక్కుంటూ వచ్చి వెన్ను తడుతుంది. మీరు ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న కోరిక నెరవేరుతుంది" అని చి.జ్యో. చెప్పాడు.

చి.జ్యోకి దక్షిణ సమర్పించుకుని ఆ అదృష్టం ఏమయివుంటుందా అని సుబ్బారావు ఆలోచించాడు. మెగాస్టార్ పిక్చర్ మొదటిరోజు మొదటి ఆటకి టికెట్ దొరకడమే ఆ అదృష్టం అనుకున్నాడు. అయితే అలా జరగలేదు. పదిహేను రోజుల వరకు ఆల్ క్లాసెస్ ఫుల్ అని తెలుసుకున్నాడు.

ఉద్యోగంలో ప్రమోషన్ అనుకున్నాడు. ఆ ప్రమోషన్‌కి ఇంకా రెండేళ్లు ఆగాలని రెండు రోజుల క్రితమే అఫీషియల్‌గా తెలుసుకున్న విషయం సుబ్బారావుకి గుర్తు వచ్చింది.

అలా అలా కాంబినేషన్లు, ప్లస్‌లు మైనస్‌లు అన్నీ చూసుకుంటూ వస్తే ఆఖరికి విమాన ప్రయాణ యోగం అవవచ్చేమో అనుకున్నాడు సుబ్బారావు. ఆఫీస్ పనిమీద ఎక్కడికి వెళ్ళాలన్నా బస్ ఫేరో, ట్రెయిన్ ఫేరో ఇస్తారు కానీ విమానం మీద పంపరు గదా అని సుబ్బారావు ఆ అదృష్టమూ కాదనుకుని ఆలోచిస్తూ నడుస్తూ వుంటే, 'హెవెన్ ఎయిర్ వేస్' ఆఫీస్, అక్కడ గుమికూడిన జనం కనిపించారు.

ఏమిటో చూద్దామని సుబ్బారావు అక్కడకు వెళ్ళి క్యూలో ఆఖరున వున్న ఆయనని అడిగాడు. "హెవెన్ ఎయిర్ వేస్ ఆకాశమార్గంలో పోటీని తట్టుకోడానికి మన దేశంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఒక రూపాయికే టికెట్ ఆఫర్ చేస్తోంది. అయితే ఈ టిక్కెట్లు పరిమితంగా వుంటాయి. ఎక్కడ నుంచి ఎక్కడికి వెళ్ళాలో చెప్పి రూపాయి ఇస్తే రసీదు ఇస్తారు. ఆ తర్వాత కొన్ని రోజుల తర్వాత లాటరీ తీసి అదృష్టం వరించిన వారికి అసలు టికెట్ ఇస్తారు. పోతే ఒక రూపాయి పోతుంది. వస్తే ఎయిర్ టికెట్ వస్తుంది" అంటూ ఆయన ఎంతో ఓపికగా చెప్పాడు.

ఆయనకు థ్యాంక్స్ చెప్పి క్యూలో ఆయన వెనక కదలడం మొదలుపెట్టాడు సుబ్బారావు. రెండు గంటల తర్వాత సుబ్బారావు కౌంటర్ దగ్గరకు చేరుకోగలిగాడు. హైదరాబాదు టు విశాఖపట్నం, విశాఖపట్నం టు హైదరాబాదు అని రెండు రూపాయలు ఇచ్చి రెండు రసీదులు తీసుకుని తన అడ్రస్, సెల్ నంబర్ వ్రాసి ఇచ్చాడు సుబ్బారావు.

ఇంటికి తిరిగి వచ్చి సెకండ్ సాటర్‌డే కనుక ఎలక్ట్రిక్ కుక్కర్‌లో వండుకున్న అన్నంలో ఆవకాయ, ఇంటికి వచ్చేటప్పుడు కొనుక్కున్న చిప్స్, తోడు పెట్టుకున్న పెరుగు వేసుకుని తిని, టీవీలో మ్యాట్నీ షో చూసి నిద్రపోయాడు బ్యాచిలర్ సుబ్బారావు.

రోజులు గడిచాయి. నడుస్తున్నాయి. హెవెన్ ఎయిర్ వేస్ విషయమే సుబ్బారావు మరచిపోయాడు.

ఒక రోజు సుబ్బారావు సెల్‌కి ఫోన్ వచ్చింది. "దిసీజ్ హెవెన్ ఎయిర్ వేస్. మే ఐ స్పీక్ టు మిస్టర్ సుబ్బారావు" అంది అవతలి ఆడకంఠం.

"సుబ్బారావు స్పీకింగ్" అన్నాడు సుబ్బారావు.

"కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ సుబ్బారావు" అంది అవతలి ఆడగొంతు.

"థాంక్స్, అయినా ఎందుకు కంగ్రాచ్యులేషన్స్" అడిగాడు సుబ్బారావు.

హెవెన్ ఎయిర్ వేస్ ఆడగొంతు వెలుగులోకి దిగింది. "ఒక రూపాయికి ఎయిర్ టికెట్ లభించిన కొద్ది మంది అదృష్టవంతులలో మీరూ ఒకరు. మీకు విశాఖపట్నం నుంచి హైదరాబాదు టికెట్ వచ్చింది. మా ఆఫీస్‌కి వచ్చి మేము ఇచ్చిన రసీదు ఇచ్చి మీ టికెట్ తీసుకోండి. ఈ నెల ఇరవయి తొమ్మిదిన విశాఖపట్నం టు హైదరాబాదు మీ ప్రయాణం" అంది ఆ ఆడగొంతు.

"బాగుంది అయితే హైదరాబాదు నుంచి విశాఖపట్నం వెళ్ళడం ఎలా" ఆ సందేహమే ఆడగొంతుకకి సుబ్బారావు వినిపించాడు.

"ఆ ఏర్పాటు మీరు చేసుకోవాలి. కావాలంటే మా రెగ్యులర్ టికెట్ నాలుగు వేల రెండు వందల రూపాయలకి కొనుక్కొని మీరు విశాఖపట్నం వెళ్ళవచ్చు" అంది ఆడగొంతు.

"ఆ సంగతి తర్వాత చూద్దాం. ముందు వచ్చి నా టికెట్ తీసుకుంటాను" అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావు హెవెన్ ఎయిర్ వేస్ ఆఫీస్‌కి వెళ్ళి రసీదు ఇచ్చి టికెట్ తీసుకున్నాడు. అక్కడ నుంచి రైల్వేస్టేషన్‌కి వెళ్ళి విశాఖపట్నం టికెట్ రిజర్వు చేసుకుందామంటే ఇరవయి తొమ్మిది దాకా టికెట్లు బుక్ అయిపోయాయని తెలిసింది. అక్కడ నుంచి బస్ డిపోకి వెళ్తే ఇరవయి ఎనిమిదికి బస్‌లో వెనుక సీటు దొరికింది.

సుబ్బారావు ఇరవయి ఎనిమిదిన బయలుదేరి ఇరవయి తొమ్మిదిన విశాఖపట్నం చేరుకుని ఆ సాయంత్రమే హెవెన్ ఎయిర్ వేస్ ఫ్లయిట్‌లో హైదరాబాదు బయలుదేరాలి. ఆఫీస్‌లో అతికష్టం మీద సుబ్బారావు మూడు రోజుల లీవ్ సంపాదించాడు. చిన్న జిప్ బ్యాగ్‌లో ఒక రోజుకి అవసరమైనవి వుంచుకుని బస్‌లో విశాఖపట్నం బయలుదేరాడు. అసలే వెనుక సీటు, వర్షాల వలన రోడ్ల రూపురేఖలు మారిపోయాయి. విశాఖపట్నంలో దిగేసరికి చికన్ గున్యా రోగిని మరిపించేలాగా సుబ్బారావు మారిపోయాడు.

విశాఖపట్నంలో ఒక ఫ్రెండ్ ఇంటికి వెళ్ళి స్నానాదులు పూర్తి చేసి ఒక చిన్న కునుకు తీసి ఎయిర్ పోర్ట్‌కి చేరుకున్నాడు సుబ్బారావు. సాయంత్రం నాలుగు గంటలకి బయలుదేరవలసిన హెవెన్ ఎయిర్‌వేస్ ఫ్లైట్ ముచ్చటగా మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరుతుందని తెలుసుకున్నాడు. ఏదో ఫర్వాలేదనుకుని మూడు గంటలు గడిచాక ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుని హె.ఎ. విమానంలోకి సుబ్బారావు ఎక్కాడు.

వచ్చిన బస్‌సీట్‌ని మరపించే సీట్‌లో చతికిలబడ్డాడు.

అందరూ ఒన్ రూపీ ప్రయాణీకుల్లాగానూ, మొదటి సారి విమానం ఎక్కినవారిలాగానూ సుబ్బారావుకి అని పించింది.

ఇంతలో పైలట్ రంగంలోకి ప్రవేశించాడు. "అందరూ ప్లాస్టిక్ తాళ్ళతో మిమ్మల్ని సీట్లకి కట్టేసు కోండి. లేకపోతే కుదుపుకి తట్టుకోలేరు" అని ప్రయాణీ కులని పైలట్ హెచ్చరించాడు.

"ఎయిర్ హోస్టెస్ అమ్మడు వుండదా" అని సందేహం వెలిబుచ్చాడు సుబ్బారావు.

"ఎవరూ వుండరు. ఇది ఒన్ మ్యాన్ షో" అన్నాడు పైలట్.

"పోనీ విమానంలో కాఫీ, మంచినీళ్లు, చాకెట్లులాం టివి ఇస్తారా" అని సుబ్బారావు అడిగాడు.

"అలాంటి సదుపాయాలు లేవు" అన్నాడు పైలట్.

"సరే పోనీ ఒన్ సదుపాయం వుందా" అని చిటికెన వేలు చూపిస్తూ అడిగాడు సుబ్బారావు.

"నో. ఎక్కేటప్పుడు, దిగాక ఎయిర్ పోర్టులలోనే వుంటుంది" అన్నాడు పైలట్.

అప్పుడు అసలు ఆందోళన సుబ్బారావుకి వచ్చింది. "ఈ విమానాన్ని హైజాక్ చేయడం కాని, ఇందులో బాంబు పెట్టడం కాని.." అంటూ నీళ్లు నమిలాడు సుబ్బా రావు.

"అలాంటి రిస్క్ వుండదు గ్యారంటీ. అందుకు మా హెవెన్ ఎయిర్‌వేస్ విమానాన్ని ఎవరూ ఎంచుకోరు" అని పైలట్ హామీ ఇచ్చాడు.

సుబ్బారావు హమ్మయ్యా అనుకున్నాడు.

"అయితే మూడు రిస్కులు వున్నాయి" అంటూ పైలట్ బాంబు పేల్చాడు.

సుబ్బారావుతో మిగిలిన ప్యాసింజర్లు కంగారుప డ్డారు.

"ఒకటి ఈ విమానం సరిగ్గా పైకి లేస్తుందా, లేస్తే గాలిలో సరిగ్గా ఎగురుతుందా, ఎగిరాక సరిగ్గా క్రిందకి దిగుతుందా అన్నదే ఆ మూడు రిస్కులు" చెప్పాడు పైలట్.

అందరికీ చెమటలు పట్టాయి.

"హెవెన్ ఎయిర్‌వేస్ పుట్టిన దగ్గర నుంచీ నేనే దీనిని తోలుతున్నాను. నేను చెప్పినవి రిస్కులు మాత్రమే మీరు ప్రాణాలు గాలిలో కలసిపోతాయనే భయం వుండదు. చెమటలు తుడుచుకోండి" పైలట్ ధైర్యం చెప్పాడు.

"అయితే మీరు క్షేమంగా గమ్యం చేరుకున్నాక అన వాయితీ ప్రకారం మూడు విఘ్నాలు గడిచినందుకు ఎయిర్‌పోర్ట్ బయట వున్న విమాన విఘ్నేశ్వరుడి గుడిలో మూడు కొబ్బరికాయలు కొట్టాలి" చెప్పాడు పైలట్.

"హమ్మయ్య, అంతేగదా" అన్నారు సుబ్బారావు ప్లస్ తోటి ప్రయాణీకులు.

విమానం కొంచెం బెట్టు చేసి గాలి లోకి లేచింది. పల్టీ కొట్టుందేమోనని భయం పుట్టించి ఎగిరింది. క్రిందకి దిగాక రన్‌వేకి వీడ్కోలు చెప్పి పక్కదారి పడుతుందేమోనని గుండెదడ తెప్పించింది. అయినా సుబ్బారావు అందరూ క్షేమంగా హైదరాబా దులో దిగారు.

సుబ్బారావు తన బ్యాగ్ భుజానికి తగిలించుకుని ఎయిర్‌పోర్ట్‌లోంచి బయటకు వచ్చేసరికి ఒక చేతిలో పెద్ద షాపర్స్ బ్యాగ్, మరో చేతిలో క్యారీ బ్యాగ్‌లు పట్టుకున్న ఒక పిల్లిగడ్డం ఆయన ఎదురయ్యాడు.

"బాబూ హెవెన్లోనే దిగారనుకుంటా. మూడు కొబ్బ రికాయలు తీసుకోండి. ముప్పయి రూపాయిలే. అదిగో ఆ రోడ్డుప్రక్కనే వుంది హెవెన్ ఎయిర్ వేస్ వారు కట్టిం చిన విమాన విఘ్నేశ్వరుడి గుడి. అక్కడికి వెళ్ళి కొట్టండి'' అంటూ క్యారీ బ్యాగ్‌లో మూడు కొబ్బరి కాయలు పెట్టి సుబ్బారావు చేతిలో వుంచాడు.

సుబ్బారావు నోరు మెదపకుండా తీసు కుని పిల్లిగడ్డం చేతిలో ముప్పయి రూపాయలు పెట్టి విమాన విఘ్నేశ్వరుడి గుడి కేసి కదిలాడు.

○

